మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులను అడ్డుకుంటున్న పోలీసులు



ఎస్ఎల్‌బీసీ కార్మికులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

మూన్నెళ్లుగా జీతాల్లేవు

అడిగితే భయపెడ్తుండ్రు!

హరీశ్‌రావుకు ఎస్ఎల్‌బీసీ కార్మికుల మొర

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'మూన్నెళ్లుగా జీతాలు ఇవ్వడం లేదు. అడిగితే భయపెట్టిస్తున్నారు. మా కండ్ల ముందే మా వాళ్లను పోగొట్టుకోవాల్సి వచ్చింది. భయంతో మేము ఉంటే, మళ్లీ లోనికి వచ్చి పనిచేయాలంటున్నరు. మేము పని చేయలేం. చేసిన పనికి డబ్బులు ఇచ్చేస్తే మా ఊరికి వెళ్లిపోతాం..' అని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కార్మికులు చిక్కుకుపోగా పరిశీలించేందుకు వచ్చి తిరిగి వెళ్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు బీఆర్ఎస్ బృందం అక్కడే సమీపంలోని షెడ్‌లో ఉన్న కార్మికుల వద్దకు వెళ్లి, వారితో కొద్ది సేపు మాట్లాడారు. కార్మికుల సమస్యలు, ప్రమాదం జరిగిన తీరు, కారణాలను అడిగి తెలుసుకున్నారు. 'కొన్ని రోజులుగా పైనుంచి నీళ్లకారుతున్నాయి. మట్టిపెళ్లలు ఊడిపడుతున్నాయి. శనివారం రాత్రి నైట్‌షిఫ్ట్‌లో నేను పనిచేసేందుకు వెళ్లగా, అప్పుడు పైనుంచి మట్టిపెల్లలు, రాళ్లు పడటం, నీళ్లు కారడం ఎక్కువైంది. ఉదయం షిఫ్ట్‌లో వచ్చిన మాతోటి కార్మికులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని చెప్పి, చూపించి జాగ్రత్తగా ఉండాలని చెప్పినం'.. అని కార్మికుడు ముత్తుసాహూతోపాటు మరికొందరు కార్మికులు ప్రమాదం జరిగిన తీరును హరీశ్‌రావుకు వివరించారు. చాలామంది కార్మికులు వెళ్లిపోయారని, తమ వద్ద చార్జీకి డబ్బులు కూడా లేవని ఆవేదన వ్యక్తంచేశారు. వీరికి హరీశ్‌రావు మనోధైర్యం కల్పించారు. కార్మికులు భయంతో ఉన్నారని, వారికి మూడునెలల కూలి డబ్బులు ఇప్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

8 మంది చిక్కుకుంటే ఇంత నిర్లక్ష్యమా?

ఒక నిర్ణయం తీసుకోవడానికి ఆరు రోజులా? • మంత్రులు పొద్దుగాలొస్తున్నరు.. సాయంత్రం పోతున్నరు • ఇదేమన్నా టూరిస్ట్ ప్లేసా?

- వారి ప్రాణాలపై ఇదేనా మీ చిత్తశుద్ధి?
- ఎన్‌డీఆర్‌ఎఫ్ కృషిని అభినందిస్తున్నం
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పరిశీలించిన అనంతరం మీడియాతో హరీశ్‌రావు
- మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలన

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్నవారి ప్రాణాలను రక్షించేందుకు ప్రభుత్వం ఆరు రోజులైనా ఎటువంటి డైరెక్షన్ ఇవ్వడం లేదని, మంత్రులు టూరిస్ట్ ప్లేస్‌కి వచ్చినట్టు హెలికాప్టర్లలో వచ్చి పోతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సహాయక చర్యల్లో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనబడుతున్నదని విమర్శించారు. గురువారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను బీఆర్ఎస్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎవరు ఏ పని చేయాలి? ఎలా ముందుకెళ్లాలి? అనే విషయంలో సర్కారు డైరెక్షన్ ఇయ్యకపోతే లోపల ఉన్న వారి ప్రాణాలు ఏమైతయి? ఏ రకంగా ముందుకు పోవాలనే దానిపై నిర్ణయం తీసుకోవడానికి ఆరు రోజులు పడుతుందా? ఇదేమన్నా టూరిస్ట్ ప్లేసా? మంత్రులు పొద్దుగాలొస్తున్నరు.. సాయంత్రం పోతున్నరు.. హెలికాప్టర్ వేసుకొని'.. అని విమర్శించారు. ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారానికి వెళ్తున్నారు కానీ ప్రమాద ఘటన స్థలానికి రావడం లేదని విమర్శించారు. ప్రమాదం జరిగినప్పుడు ఒక విధానం, ఒక డైరెక్షన్ ఇచ్చే బాధ్యత ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. సరైన డైరెక్షన్ ఇచ్చి ఉంటే, లోపల ఉన్న కన్వేయర్ బెల్ట్‌ను మరమ్మతు చేసి ఉంటే, దానిద్వారా లోపల ఉన్న బురదను బయటికి పంపించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. 'బోరింగ్ మిషన్‌పై రాళ్లు పడి కొన్ని భాగాలు వంగిపోయినయ్.. చెల్లాచెదురుగా పడి ఉన్నాయని చెప్పిండ్రు.. మిషన్‌ను కట్ చేసి తీస్తే గాని లోపల ఉన్న మట్టి, బురదను తొలగించే అవకాశం లేదు.. అది కట్ చేయాలా? వద్దా? అనే దానిపై నిర్ణయం తీసుకోవడానికి ఐదు రోజులు సమయం తీసుకుంటే ఎట్లా? లోపల చిక్కుకున్న వారి ప్రాణాలు ఏం కావాలి?' అని మండిపడ్డారు. ఆరు రోజుల తర్వాత తట్టెడు మట్టిని బయటికి తీశారని, చిక్కుకున్న ఎనిమిది మంది ప్రాణాల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా? అని మండిపడ్డారు.

కేసీఆర్ హయాంలోనే ఎస్ఎల్‌బీసీలో ఎక్కువ పని చేశాం

ఎస్ఎల్‌బీసీ కోసం గత ప్రభుత్వం పని చేయలేదంటున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక సారి రికార్డులను పరిశీలించుకోవాలని హరీశ్‌రావు సవాల్ చేశారు. తొమ్మిదేండ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకి రూ.3,300 కోట్లు ఖర్చు పెడితే, తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.3,900 కోట్ల పని జరిగిందని వివరించారు. కాంగ్రెస్ హయంలో కంటే రూ.600 కోట్ల పని ఎక్కువగా చేశామని స్పష్టంచేశారు. కరోనా వచ్చినా, పదివేల లీటర్ల సీపేజీ వచ్చినా దాదాపు 12 కిలోమీటర్ల టన్నెల్ పూర్తి చేశామని తెలిపారు. డిండి, పెండ్లిపాక రిజర్వాయర్లను పూర్తిచేశామని చెప్పారు. ఈ 14 నెలల్లో కనీసం 15 మీటర్లైనా సొరంగం తవ్వారా ? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలోనూ మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు కూడా తనతోపాటు ఇక్కడకు వచ్చి పనులు సమీక్షించారని గుర్తుచేశారు. ఇప్పుడేమో ప్లేటు ఫిరాయించి నాలుక మడత పెట్టిండని, ఇదేమి పద్ధతని మండిపడ్డారు.

> సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకిపోయి మాట్లాడుతరు.. కానీ, ఇక్కడికి వచ్చి చూసే తీరిక లేదంట.. హెలికాప్టర్ వేసుకుని సీఎం ప్రచారానికి పోతే, మంత్రేమో హెలికాప్టర్ లేదని హైదరాబాద్‌లో ఉండిపోయారు.. వీరికి ఎనిమిది మంది ప్రాణాలు ముఖ్యమా? ఎన్నికల ప్రచారం ముఖ్యమా? రేవంత్‌రెడ్డి ఎందుకు సమీక్షించలేదు? ఇక్కడికి వచ్చి ఆ కుటుంబాలకు ధైర్యం చెప్పే ప్రయత్నం ఎందుకు చేయలేదు? ఒక ప్రాజెక్టు కూలిపోతే పట్టించుకునే బాధ్యత లేదా?
> -హరీశ్‌రావు

ఇంత నిర్లక్ష్యమా?

'మేము ఇక్కడికి వచ్చి ఎన్‌డీఆర్ఎఫ్, ఇతర బృందాలు, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడినం.. కన్వేయర్ బెల్ట్ ఎప్పుడు పూర్తవుతుందని వారిని అడిగితే రెండు, మూడు రోజులు పడుతుందని చెప్తున్నారు. మంత్రేమో రెండ్రోజుల్లో ఆపరేషన్ అంతా అయిపోతదని అంటున్నరు. ఆరు రోజులైనా కన్వేయర్ బెల్ట్ ఉపయోగంలోకి రాలేదు. ఇంతవరకు డేబ్రీస్‌ను లోపలి నుంచి బయటికి తీసుకొచ్చే పరిస్థితి లేదు. లోపల ఉన్న మిషన్లను కట్ చేసి డేబ్రీస్‌ను బయటికి తీసుకురావడానికి ఇంత నిర్లక్ష్యమా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మేము మాట్లాడుతుంటే మాట్లాడనివ్వకుండా వారిని పక్కకు తీసుకెళ్తున్నరు. ఇదేం పద్ధతి? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము టన్నెల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తే అడ్డుకున్నారని మండిపడ్డారు. మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చూస్తే తప్పులేదా? మేము చూస్తే తప్పా? అని ప్రశ్నించారు. ఎనిమిది మంది ప్రాణాలతో బయటకు రావాలన్న ఆకాంక్షతో సహాయక చర్యలకు తాము సహకరిస్తుంటే, మంత్రులు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే ప్రాజెక్టు కూలిపోయిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ ప్రమాదానికి, గత ప్రభుత్వానికి సంబంధం ఏమిటని నిలదీశారు. 'మీరు పని ప్రారంభించేటప్పుడు జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పర్మిషన్ ఇచ్చిందా? నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానికల్ నుంచి అనుమతి పొందారా? ఇస్తే రిపోర్ట్ బయట పెట్టండి' అని నిలదీశారు. ఆదరాబాదరాగా పనులు ప్రారంభించి, ఒక ప్రాజెక్టు కుప్పకూలేలా చేశారని మండిపడ్డారు. బాధిత కుటుంబసభ్యులను తాము కలిసేందుకు ప్రయత్నిస్తే, వారిని కలవనీయకుండా దాచి పెట్టారని, ఎందుకంత భయం? అని నిలదీశారు. ప్రధాన ప్రతిపక్షంగా బాధ్యతాయుతంగా బాధిత కుటుంబాలను ఓదార్చాలని, వారికి ధైర్యం చెప్పాలని, ప్రభుత్వానికి సూచనల ఇవ్వాలని వస్తే తమను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. తాము లోపలికి వెళ్లి ఎన్‌డీఆర్ఎఫ్ టీంను కలిసి, వారు చేస్తున్న ప్రయత్నాన్ని అభినందించామని చెప్పారు. సహాయక చర్యల్లో ఉన్న రైల్వే టీం, సింగరేణి టీం, ఎన్‌డీఆర్ఎఫ్, ఆర్మీ, నేవీ, ర్యాట్ మైనర్స్ టీంలను సమన్వయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు.

14 నెలల్లో 4 ప్రాజెక్టులు కూలినై..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో నాలుగు ప్రాజెక్టులు కూలిపోయాయని, ప్రభుత్వం ఏమి చేస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. 'ఖమ్మం జిల్లాలో పెద్దవాగు కొట్టుకుపోయింది. సుంకిశాల కుప్పకూలిపోయింది. వట్టెం పంప్‌హౌస్ జలమయమైపోయింది. ఇవాళ ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోయిన పరిస్థితి ఏర్పడింది' అని ఆరోపించారు. సమావేశంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, కంచర్ల రాంభూపాల్‌రెడ్డి, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు రజినీ సాయిచంద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, కురువ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో సర్కారు విఫలం

ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టడంలో సర్కారు దారుణంగా విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. గురువారం ఆయన ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు బయల్దేరే ముందు హైదరాబాద్ కోకాపేటలోని తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. ఘటన జరిగి ఐదురోజులు దాటినా కార్మికుల ఆచూకీ కనుగొనకపోవడం, రెస్క్యూ ఆపరేషన్ మొదలు పెట్టకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు.

> ఇప్పటికైనా సహాయక చర్యల్లో సమన్వయం సాధించాలి. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణుల సలహాలు స్వీకరించాలి. ప్రతిదీ జాగ్రత్తగా, వేగవంతంగా చేయాలి. ప్రతి నిమిషం అత్యంత ముఖ్యమైనది. ఇప్పటికే ఆరు రోజులు వృథా చేశారు. ఆక్సిజన్, ఆహారం, మందులు లేకపోతే పరిస్థితి ఏమిటి? లోపల చిక్కుకున్నవారి స్థానంలో ఉండి ఆలోచించాలి. వారంతా ఇతర రాష్ట్ర కూలీలు. ప్రాణాలకు తెగించి మన రాష్ట్రం కోసం ప్రాజెక్టు కడుతున్నరు. వారిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకండి.
> -హరీశ్‌రావు

హరీశ్‌రావు బృందాన్ని అడ్డుకోవడానికి భారీగా మోహరించిన పోలీసులు

అడుగడుగునా ఆంక్షలు

హరీశ్‌రావు బృందం పర్యటన సందర్భంగా దోమలపెంట వద్ద భారీగా పోలీసుల మోహరింపు

- సొరంగం వద్దకు వెళ్లేందుకు 8 మందికే అనుమతి
- చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు
- మాజీ మంత్రుల ఆగ్రహం..నిరసన
- మంత్రి ఉత్తమ్‌ను కలవకుండా గేటువద్ద అడ్డగింత

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించేందుకు బీఆర్ఎస్ బృందానికి అనుమతి ఇచ్చినట్టే ఇచ్చి ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టించింది. ఇద్దరు ఐజీలు, ముగ్గురు ఎస్పీలు, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐ, ఎస్సైలతో అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారు. గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో నల్లగొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సొరంగ ప్రమాద ఘటనను పరిశీలించి ప్రభుత్వానికి సూచనలు చేయడానికి రాగా, దోమలపెంట సమీపంలోని అటవీశాఖ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను నిలిపివేశారు. హరీశ్‌రావు తోపాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ల బృందం 150 వాహనాల భారీ కాన్వాయ్‌తో దోమలపెంటకు చేరుకున్నారు. వారు రాకముందే దోమలపెంట చెక్‌పోస్టు నుంచి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వరకు అడుగడుగునా పోలీసు బలగాలు మోహరించాయి. టన్నెల్‌కు వెళ్లే దారిలో కాన్వాయ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, బీఆర్ఎస్ బృందం మధ్య వాగ్వాదం జరిగింది. టన్నెల్‌లోకి వెళ్లడానికి చివరికి ఎనిమిది మందికి అనుమతి ఇచ్చారు. పోలీసుల వాహనంలో ఎక్కాలని, తాము తీసుకెళ్తామంటూ పోలీసులు వాహనం సిద్ధంగా ఉంచారు. అయితే, హరీశ్‌రావు తమ వాహనంలోనే వస్తానని తెగేసి చెప్పడంతో రెండు వాహనాల్లో ఎనిమిది మందికి అనుమతి ఇచ్చి, వెనుకాముందు పోలీసుల వాహనాలతో తీసుకెళ్లారు. మూడు చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేశాకే లోపలికి అనుమతించారు. లోపల నాలుగో చెక్‌పోస్టు వద్ద మళ్లీ వాహనాలను ఆపి అందులో ఉన్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రిజనార్దన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడిని కిందికి దింపి వాహనాలను తనిఖీ చేశారు. వెంబడి కెమెరాలు, ఫోన్లు ఉండరాదని ఆంక్షలు విధించారు. కెమెరామెన్ ఉంటే కూడా దింపి బయటకు పంపించేశారు. ఎనిమిది మందిని వద్దని కేవలం ఆరుగురే వెళ్లాలని ఆపేశారు. దీంతో ప్రభుత్వ తీరును ఖండిస్తూ బీఆర్ఎస్ బృందం అక్కడే బైఠాయించింది. చివరకు అనుమతించారు. టన్నెల్ వద్ద ప్రమాదస్థలిని పరిశీలించిన అనంతరం బీఆర్ఎస్ నేతలు తిరిగి జేపీ కంపెనీ గెస్ట్‌హౌస్ వద్ద మీడియా పాయింట్‌కు చేరుకున్నారు. కొద్దిసేపటి తర్వాత ఎమ్మెల్సీలు నవీన్‌రెడ్డి, కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రజినీ సాయిచంద్ మూడో చెక్‌పోస్టుకు రాగానే వాహనాన్ని ఆపేశారు. తాము ఇద్దరం ఎమ్మెల్సీలమని నవీన్‌రెడ్డి, కోటిరెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తాము ప్రజల తరపున వచ్చామని ఎంతచెప్పినా ఆరగంటపాటు వాదోపవాదాలు జరిగినా అనుమతించలేదు. దీంతో వారు బీఆర్ఎస్ నేతలను చూస్తేనే ప్రభుత్వం భయపడుతున్నదంటూ పోలీసుల తీరును ఖండించారు. మీడియా సమావేశం అనంతరం హరీశ్‌రావు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసేందుకు గెస్ట్‌హౌస్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా గేటు బంద్ చేశారు. తాను నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశానని, ఏడుసార్లు ఎమ్మెల్యేగా అనుభవం ఉన్నదని, కొన్ని సూచనలు, సలహాలు చేసేందుకు మంత్రి ఉత్తమ్‌ను కలుస్తానని చెప్పినా పోలీసులు అనుమతించలేదు. దీంతో హరీశ్‌రావు గేటును తోసుకుంటూ వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు భారీగా మోహరించి అడ్డుకున్నారు. ఎస్పీ, బీఆర్ఎస్ నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకున్నది. దీంతో చేసేది లేక గేటు ఎదుట కూర్చొని నిరసన వ్యక్తంచేశారు.

మీడియాను బయటకు పంపి గేటుకు తాళం

మీడియాపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఇంతకుముందు ఘటన స్థలం వరకు అనుమతిచ్చేవారు. కానీ మూడు రోజులుగా రానివ్వడం లేదు. టన్నెల్ పై భాగంలో జేపీ కంపెనీ గెస్ట్‌హౌస్ వద్ద మీడియా పాయింట్ ఏర్పాటు చేశారు. అక్కడే టన్నెల్‌లో జరుగుతున్న సహాయక చర్యల వివరాలను వెల్లడిస్తున్నారు. గురువారం అక్కడినుంచి బయట చెట్ల కిందకు పంపి గేట్‌ను మూసేశారు. వారిని ఎండలో కూర్చోబెట్టడంతో అప్పుడే గెస్ట్‌హౌస్‌లోకి వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కలిసి పరిస్థితిని వివరించారు. తాగేందుకు నీళ్లులేవు, కూర్చునేందుకు కుర్చీలు లేవు, ఎందుకు ఎండలో నిల్చోబెట్టారని మంత్రిని ప్రశ్నించడంతో అప్పుడు మరో టెంటు వేసి, నీళ్లు ఏర్పాటుచేశారు. ప్రతిపక్షం వస్తున్నందుకు మమ్మల్ని బయటకు పంపించారా? అంటూ మీడియా ప్రతినిధులు సెటైర్లు వేశారు.

3 రోజుల్లో సహాయక చర్యలు పూర్తి

- టన్నెల్‌లో చిక్కుకున్న వారిని బయటకు రప్పిస్తాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/అచ్చంపేట, దోమలపెంట: మరో మూడు రోజుల్లో ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. మరో మూడు నెలల్లో తిరిగి సొరంగం పనులు ప్రారంభిస్తామని వివరించారు. సొరంగంలో చిక్కుకున్న 8 మందిని బయటకు తీసుకొస్తామని చెప్పారు. గురువారం దోమలపెంటలో మంత్రి మీడియాతో మాట్లాడారు. దేశంలోని పేరెన్నిక గన్న నిపుణులతో సహాయక చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. బాధితులను రక్షించేందుకు దక్షిణ మధ్యరైల్వేకు చెందిన ప్లాస్మా కటింగ్ నిపుణుల బృందాన్ని కూడా రప్పించామని చెప్పారు. టన్నెల్‌లో ఉన్న నీటిని భారీ పంపులతో బయటకు పంపుతూ, బురదను తొలగిస్తూ, టీబీఎం ముందు భాగం వరకూ రెస్క్యూ బృందాలు చేరుకుంటున్నట్టు చెప్పారు. రెండు మూడు రోజుల్లో రెస్క్యూ ఆపరేషన్‌ను పూర్తి చేస్తామని వివరించారు.

సీఎం ధనదాహంతో 8 మంది గల్లంతు

- పాలన చేతగాకే రేవంత్ నిందలు
- అసమర్థతను కప్పిపుచ్చుకునే యత్నం
- ఎస్ఎల్‌బీసీ ఘటనకు పూర్తి బాధ్యత రేవంత్‌దే: కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి ధనదాహం వల్లే 8 మంది కార్మికులు ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంలో చిక్కుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వారంతా ఇప్పటికీ సజీవంగా ఉన్నారో, లేదోననే ఆందోళన నెలకొన్నదని, ఈ ప్రమాదానికి పూర్తి బాధ్యత రేవంత్‌రెడ్డిదేనని ఆయన తేల్చిచెప్పారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంపై ఢిల్లీలో రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఏఎన్ఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేటీఆర్ తీవ్రంగా తీవ్రంగా ఖండించారు. తన అసమర్థతను, పాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వంపై నెపం వేయజూస్తున్నారని మండిపడ్డారు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్టుగా రేవంత్ తీరు ఉన్నదని నిప్పులు చెరిగారు. జీఎస్ఐ, నిపుణత గల ఇంజనీరింగ్ సంస్థలను సంప్రదించకుండా, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా, అవినీతి సొమ్ముల కోసం ఆగిపోయిన ప్రాజెక్టు పనులను పాత యంత్రాలతోనే ప్రారంభించారని విమర్శించారు. సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించాల్సిందిపోయి సీఎం బ్లేమ్ గేమ్ ఆడుతున్నారని మండిపడ్డారు. సీఎంగా దేవుడిచ్చిన అవకాశాన్ని వాడుకొని ప్రజలకు మంచి చేయాల్సింది పోయి కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

పాలన గాలికొదిలి టైంపాస్ రాజకీయాలు

పాలనను గాలికొదిలిన సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్రంలో జరుగుతున్న మరణాలపై ఇతరులను బద్నాం చేయాలని చూస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే జరిగిన మరణాలపై సమగ్ర దర్యాప్తు చేసి నిజానిజాలను నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. టైంపాస్ రాజకీయాలు చేయడం కాంగ్రెస్ సర్కార్‌కు అలవాటేనని విమర్శించారు. సందర్భం వచ్చిన ప్రతీసారి రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ అబద్ధాలు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ పనితీరును పలుచన చేసేందుకే పదే పదే రూ.6,500 కోట్లను కేవలం వడ్డీల కింద చెల్లిస్తున్నామని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఉదహరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై అవగాహన లేకే రేవంత్‌రెడ్డి ఇలా నోరోపారేసుకుంటున్నారని మండిపడ్డారు.

ఎస్ఎల్‌బీసీ వద్ద సీఎండీ బలరామ్

ఇంకొందరు రెస్క్యూ సిబ్బందిని రప్పిస్తాం

సింగరేణి సీఎండీ బలరామ్

హైదరాబాద్, ఫిబ్రవరి 27,(నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ సహాయ చర్యల్లో మరింత తోడ్పాటును ఇచ్చేందుకు మరో 200 మంది రెస్క్యూ సిబ్బందిని పంపించనున్నట్టు సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ వెల్లడించారు. గురువారం సాయంత్రం ఆయన ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్దకు చేరుకున్నారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి సింగరేణి రెస్క్యూ బృందం సహాయ చర్యల్లో నిమగ్నమైంది. ఇప్పటికే ఘటనా స్థలికి చేరిన 100 మందికి పైగా సిబ్బందిని, అత్యాధునిక సహాయ సామగ్రిని చేరవేసినట్టు తెలిపారు. చిక్కుకున్న వారు క్షేమంగా బయటకు రావాలని ఆకాంక్షించారు.

బీఆర్ఎస్ ఒత్తిడి.. సర్కారు తడబడి

మొదటిపేజీ తరువాయి...

చేయాలో ముందే నిర్ణయించుకొని సొరంగమార్గంలో వెళ్లి ఆయా పనులను ముగిస్తున్నారు. సహాయక చర్యలు ఆశాజనకంగా సాగుతుండటంతో మరికొన్ని గంటల్లోనే కార్మికుల జాడను తెలుసుకుంటామని ఉన్నతాధికారులు ధీమా వ్యక్తంచేస్తున్నారు.

భారీ కట్టర్లతో మిషన్ కటింగ్

దక్షిణ మధ్య రైల్వేకు చెందిన భారీ ప్లాస్మా కటింగ్ మిషన్‌తో టీబీఎం యంత్ర పరికరాలను ముక్కలుగా కట్ చేసి బయటకు తరలిస్తున్నారు. సహాయక బృందాలు రాత్రి, పగలు నిర్విరామంగా కష్టపడుతున్నారు. టన్నెల్‌లో ఉన్న నీటిని భారీ పంపులతో బయటకు తోడుతున్నారు. ట్రైన్లో అమర్చిన పెద్ద కంటైనర్లలో బురదను బయటకు తరలిస్తున్నారు. సుమారు 10 వేల క్యూబిక్ మీటర్ల బురద ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నిర్విరామంగా రెస్క్యూ ఆపరేషన్

ఆర్మీ, నేవీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్, ర్యాట్ మైనర్స్, దక్షిణ మధ్య రైల్వే ప్లాస్మా కట్టర్స్, రాబిన్‌సన్ మైనింగ్ ప్రతినిధులు, మెగా, నవయుగ తదితర కంపెనీల బృందాలు నిరంతరం సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నట్టు జిల్లా కలెక్టర్ సంతోష్ మీడియాకు వివరించారు. బురద నీటిని తొలగించే ప్రక్రియ పూర్తి కావడానికి రెండు రోజులు పట్టే అవకాశం ఉన్నదని తెలిపారు.

సహాయక చర్యల్లో మైనింగ్ సిబ్బంది

ఇండియా బోర్డర్స్ ఆర్గనైజేషన్ సేవలను ఉపయోగిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై రెస్క్యూ టీంలు దృష్టి సారించడంతో తొలగింపు ప్రక్రియ వేగంగా సాగుతున్నది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం రెస్క్యూ బృందాలకు వెసులుబాటు కల్పించడంతో ఆయా బృందాలు తమ పనిని సాఫీగా చేసుకుంటున్నాయి. కార్మికులు చిక్కుకున్న ప్రదేశాన్ని రెండు, మూడు రోజుల్లో గుర్తించి బాధితులను బయటకు తీసుకొస్తామని చెప్తున్నారు.

హరీశ్‌రావు రాకతో కదలిక

ప్రమాదం జరిగిన ఆరు రోజుల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యల్లో వేగం పెంచింది. మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో గురువారం బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఘటన